# రాజహంస రెక్కలు విప్పింది.....



అవన్నీ పాలరాయి ముక్కలు.

పాల వెన్నెల రాతిలో ప్రాణాలు పోసుకున్న శిల్పాలు.

వెన్న ముద్దలాంటి శిలల్లో వేణుగానం చేసే కళాఖండాలు.

కొన్ని వేల సంవత్సరాలక్రితం -

అంటే "మన తాత ముత్తాతలకి ముందునాటి మాట" అంటూ కథ మొదలుపెడ్తే అంత బాగుండదు అని కొందరికి అనిపించవచ్చు. వర్తమానం గొప్పదనీ, భవిష్యత్తులోకి దృష్టి సారించటం ఎంత అవసరమో, మనపూర్వుల కళాప్రాభవాల్ని మననం చేసుకోడం అంత అవరమున్నూ.

గతం గాలిలో కలిసిపోదు.

గతం నుంచి నేటిదాకా గాలి వీస్తూనే ఉంది. కృష్ణ పారుతూనే ఉంద. గతాన్ని గురించి కృష్ణ పాడుతుంటే గతకాలపు శిల్పాలు ఆనాటి కథలు చెప్తున్నాయి.

అదుగో! ఆమె యక్షిణి!

ఇంతలేసి కళ్ళతో మనవైపే చూస్తోంది. ఎత్తయిన జుట్టుముడి; పొడవాటి కేశపాశాన్ని పాయలు పాయలుగా చీల్చి మెలికలు మెలికలుగా చుట్టి మల్లెపొదలా నిండుగా ముడివేసింది. ఆ జుట్టుముడిలో దీపాల్లా పువ్వులు, ముండినంతనీ చుట్టి వేస్తూ మరో పూలదండ.

మెడ వొత్తుగా ఉంది. మెడనిండా ఆభరణాలు వేళ్ళాడుతున్నాయి. నక్షత్రమాలిక ఎత్తయిన వక్షోజాలమీంచి కటిప్రదేశందాకా సాగింది. ముత్యాల పేర్లు గుండెనిండా పరుచుకున్నాయి. రత్నాల హారం కంఠాన్ని కౌగిలించుకొని విడవడం లేదు. కుచభారానిక నడుం సన్నగిల్లింది. పక్కకి వయ్యారంగా వొరిగిపోయింది. ఆ వొంగిన వయ్యారపు నడుం మీదగా, యక్షిణీ వామహస్తం. ఆ చేతిలో పూలసజ్జ. కరకంకణాలు మోచేయిదాకా వెలుగుతూంటే, ఆ సజ్జనిండా రకరకాల పువ్వులు!

ఇంతలేసి కళ్ళతో మనవైపే చూస్తోంది. ఓరయ్యా! వయసుకాడా! నన్ను అబ్బురంతో చూస్తున్న చిన్నవాడా! నేనెవరో తెలుసా? కాగితాలకి. తారీఖులకి అందని సౌందర్యాన్ని, కళ్ళకి కాంతి తెలిసినట్టే, మనసుకు మాత్రమే

అనుభవమయ్యే అందాన్ని. ఓ లాగు, చొక్కా వేసుకొన్న నాగరికుడా! నువ్వు రోజూ చూసే స్త్రీ లాంటి దాన్ని కాదే నేను! నన్ను చూసి పొంగిపోతున్నావేల? నన్ను చూసి అవాక్కయిపోతున్నా వేల .... నేను చరిత్రలోని దీపాన్ని. నన్ను మలచిన వాడు, నాకు రూపమిచ్చి ప్రాణం పోసినవాడు, ఓ భిక్షువు. కాషాయం ధరించి, సర్వసంగ పరిత్యాగం చేసి, బౌద్ధ ధర్మాన్ని మనసా వాచా స్మరించుకునే ఓ సన్యాసి నన్ను ఈ రాతిమీద చెక్కాడయ్యా! ఈ పువ్వులతో వెళ్ళి బుద్ధుడి పాదాలు మెత్తగా అద్దమని, ఈ తనువుతో మోకరిల్లమని నన్నంపుతున్నాడయ్యా! బుద్ధుడిసేవలో నన్ను నియమిస్తున్నాడు కనుక నన్నింత అపురూప సౌందర్యవతిగా తీర్చాడయ్యా! అంతటి స్వామికి అర్పించుకుంటుంటే అపూర్వంగా ఉండాలని భావించాడయ్యా! ఈనాటి కళ్ళతో ఆనాటి సత్యాల్ని చూడవయ్యా!

అటు చూశావా! ఆ బొమ్మ!

బుద్ధుడు యశోధర అంతఃపురం నుంచి అర్ధరాత్రివేళ తరలి వెళ్తున్నాడు, కట్టుకున్న భార్యని కాదన్నాడు. కన్నబిడ్డని వొదిలేసుకున్నాడు. జగత్తే తన సంసారమనుకుని, ఈ లోకంలో దుఃఖం నివారించడానికి, శాంతి పూయించటానికి వొంటిగా బయలుదేరాడు బుద్ధుడు. అది మహాభినిష్క్రమణం. జగత్కల్యాణానికి నాంది. ఆ సుముహూర్తాన అదృశ్యంగా యక్షులు, కిన్నరులు బుద్ధుణ్ణి స్తుతిస్తున్నారు.

రథం బయలుదేరింది. ముందు ముందుకు సాగిపోతోంది. రథాన్ని లాగుతున్న గుర్రాల గిట్టల కింద సిద్ధులు అరచేతులు పెడుతున్నారు, ఎందుకు? సవ్వడి కాకూడదు కనుక. గుర్రపు గిట్టల చప్పుడయితే అంతఃపురం మేల్కొనవచ్చు. యశోధర మేల్కొనవచ్చు. రాహులుడు లేచి 'నాన్నా', అని పిలవచ్చు. సిద్ధార్థునిక మోహపాశం బంధించి వేయవచ్చు. అంచేత ఆ లోక కల్యాణ యాత్ర నిశ్శబ్దంగా చీకటికి కూడా తెలియకుండా జరిగిపోవాలి. అందుకే గుర్రపు గిట్టల కింద

నలిగిపోయే సిద్ధుల అరచేతులు. త్రేతాయుగంలో జరిగిన రామ కళ్యాణం గురించి కూడా ఇలాంటి కథే ఉంది. సీతారాముల వివాహానికి ముహూర్తం పెట్టిందెవరు? అటు వసిష్ఠుడు! ఇటు శతానందుడు! అంతటి మహాఋషులు నిర్ణయించిన ముహూర్తానికి సీతారాముల కళ్యాణం జరిగితే వాళ్ళిద్దరూ పట్టుమని పదేళ్ళపాటు కలసి కాపురం చేశారా? లేదు. నిజానికి ఆ ముహూర్తానికి ఆ వివాహం జరిగితే వాళ్ళకు వియోగం లేదు. వియోగం లేకపోతే రాక్షస సంహారం జరగదు. అవతార ప్రయోజనం సమకూరదు.

స్వర్గంలో దేవతలు కలతపడ్డారు. ఏంచేయాలో తోచింది కాదు. ఓ అప్సరసని కళ్యాణ మంటపానికి పంపారు. ఆ అప్సరస నృత్యం చేస్తోంది. జనం మైమరచి నృత్యం తిలకిస్తున్నారు. ఆ మైమరపాటులో ముహూర్తం గడియ తప్పింది. వసిష్ఠుడు, శతానందుడు ముఖాలు ముఖాలు చూసుకున్నారు. చేసేది లేక దైవ నిర్ణయం అనుకుని తప్పిపోయిన ముహూర్తానికే కళ్యాణం జరిపించారు.

ఆనాడు ఆ ముహూర్తం తప్పిపోవటం ఎంత అవసరమో, ఈనాడు సిద్ధార్థుడి యాత్ర నిశ్శబ్దంగా జరగటం అంత అవసరం.

రథం సాగిపోతోంది. పరమ రహస్యంగా, పరమ నిశ్శబ్దంగా సాగిపోతోంది. గుర్రాలు సిద్ధుల అరచేతులమీద పరుగెత్తుతున్నాయి. అప్పుడు నేలతల్లి సిద్ధులతో అందిట - "నాయనలారా! నా స్వామి లోక కళ్యాణయాత్రకు వెళ్తున్నాడు. నా స్వామిని మోసే గుర్రాల పాదాల్నయినా నన్నంట నివ్వరేమీ" అని.

అప్పుడు సిద్ధులు అన్నారుట "తల్లీ! ఈ యాత్ర ఇలాగే వెళ్లాలి. ఆ తర్వాత సిద్ధార్థుడు బుద్ధుడవుతాడు గదా! అప్పుడు స్వామి గుర్రాలకేమి? స్వామి పాదచారియై ఉంటాడు గదా! అప్పుడు సేవించుకొందువుగాని" అని. *